
సాక్షి
పల్నాడు
గురువారం । 5 । జూన్ । 2025



మొక్కలు నాటే కార్యక్రమం

చిలకలూరిపేట: ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీలోని సాయిబాబా గుడివద్ద మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 511.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 4,050 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



నకరికల్లు: నర్సింగపాడు శ్రీ గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. అర్చకుడు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు రాష్ట్ర స్థాయి 'యోగాంధ్ర'

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

నరసరావుపేట: యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఈనెల ఐదవ తేదీ గురువారం ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ రాష్ట్రస్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సుమారు 10వేల మంది పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నినాదంగా 'ఏఎన్‌ఎంలు మరియు ఆశా వర్కర్లు'గా ఎంపిక చేయడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు.

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం..

గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెరేడ్ గ్రౌండ్స్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలం, మున్సిపాలిటీలలో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా అన్నిశాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం(గుంటూరు ఈస్ట్) : గుంటూరు కృష్ణానగర్ ఒకటో వీధిలోని గోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల ఐదు నుంచి తొమ్మిది వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ధనకుదరం శ్రీనివాసాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు జీడీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి బాధ్యతల స్వీకరణ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (జీడీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జిగా వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు గురువారం ఉదయం 11 గంటలకు బ్రాడీపేటలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు జీడీసీసీబి ఇన్‌చార్జి సీఈఓ ఫణికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా వడ్రాణం హరిబాబు గురువారం ఉదయం 8.45 గంటలకు కన్నావారితోటలోని జీడీసీఎంఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సివిల్స్ ర్యాంకర్‌కు తెలంగాణ గవర్నర్ సత్కారం



తెనాలి: గత నెలలో వెలువడిన సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ర్యాంకు సాధించిన తెనాలికి చెందిన దోనేపూడి విజయ్‌బాబును బుధవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సత్కరించారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్–2024 పరీక్షల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ర్యాంకర్లను తెలంగాణ రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఆ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సత్కరించారు. అందులో భాగంగా విజయ్‌బాబు సత్కారం అందుకున్నారు. ఆయన గతంలోనే సివిల్స్‌లో ర్యాంక్ సాధించి, ఐఆర్‌ఎస్ అధికారిగా సేవలను అందిస్తున్నారు. మెరుగైన ర్యాంకు కోసం మళ్లీ 2024 పరీక్షలు రాశారు. ఆ పరీక్షల్లోని ర్యాంకర్లకు ఇంకా పోస్టింగులు ఇవ్వాల్సివుంది. ఐపీఎస్ వస్తుందని విజయ్‌బాబు, ఆయన తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

రేపు ఐటీఐ ప్రవేశాలకు కౌన్సెలింగ్

తెనాలి అర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో ప్రవేశాల కోసం శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి వెంకటేశ్వర్లు ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మెరిట్ నెంబర్ 1 - 150, మధ్యాహ్నం 2 గంటలకు 151 - 298 వరకున్న వారికి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు. మెరిట్ నెంబర్ తెలుసుకునేందుకు ఫోను నెంబర్ 93477 95893, 63045 72793లలో సంప్రదించాలని సూచించారు.



చిలకలూరిపేటలో వెన్నుపోటు దినం ర్యాలీలో మాజీ మంత్రి విడదల రజిని



మాచర్లలో నిరసన వ్యక్తం చేస్తున్న పూనూరు గౌతమ్‌రెడ్డి, పిన్నెల్లి రమాదేవి, స్వాతి



పిడుగురాళ్లలో జరిగిన కార్యక్రమంలో ప్లకార్డు ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

బాబూటకాలపై ఆగ్రహ జ్వాల

వెన్నుపోటుపై ప్రజాగ్రహం

- ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ నిరసన ర్యాలీలు చేపట్టిన వైఎస్సార్ సీపీ
- అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పెద్ద ఎత్తున హాజరైన ప్రజలు, పార్టీ శ్రేణులు
- అడుగడుగునా అడ్డంకులు సృష్టించిన పోలీసులు
- మాచర్లలో ర్యాలీకి అనుమతి ఇవ్వకుండా నేతల హౌస్ అరెస్ట్
- వినుకొండలో మైక్ కోసం ముందస్తు అనుమతి తీసుకున్నా దౌర్జన్యంగా అడ్డుకున్న వైనం
- చిలకలూరిపేటలో బైక్ ర్యాలీ చేయకుండా ఆంక్షలు
- ఎన్ని అడ్డంకులు సృష్టించినా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పల్నాడులో కదం తొక్కిన ప్రజలు

సూపర్–6 హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదైనా వాటిని అమలు చేయకపోవడంపై కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. వాగ్దానాల అమలును గాలికొదిలేసి, తమను రోడ్డున పడేసిన వైనంపై జనం కన్నెర్ర చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిందేనంటూ వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి కదం తొక్కారు. కూటమి ప్రజాకంటక పాలన పోవాలంటూ నినదించారు. పోలీసు ఆంక్షలను ఛేదించి వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేశారు.



నరసరావుపేటలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో ప్రజలు, పార్టీ శ్రేణులతో కలిసి నడుస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

సాక్షి, నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేకతను చాటిచెప్పారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు జరిగాయి. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనం నినాదాలు చేశారు. మాట ఇచ్చి మోసగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటినుంచి చంద్రబాబుది వెన్నుపోటు నైజమని, మరోసారి తన మోసకారి బుద్ధిని చూపాడన్నారు. మరోవైపు ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని నిరసన ర్యాలీలను ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నం చేసింది. ర్యాలీలకు, మైక్‌లకు, బైక్‌లకు అనుమతులు లేవంటూ ఎన్నడూలేని ఆంక్షలు విధించారు. అయితే ప్రజలు పోలీసు ఆంక్షలను ఛేదించి వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేశారు.

వినుకొండలో...

వెన్నుపోటు దినం ర్యాలీ వినుకొండలో విజయవంతమైయింది. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో ఐదు మండలాల నుంచి వేలాదిగా కార్యకర్తలు తరలివచ్చారు. ఉదయం 10గంటలకు పార్టీ కార్యలయం వద్ద నుంచి పల్నాడురోడ్డు శివయ్య స్థూపం సెంటరుమీదుగా తహసీల్దార్ కార్యాయలం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం తహసీల్దార్ సురేష్‌నాయక్‌కు బొల్లాతో పాటు నాయకులు కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. వేలాదిమంది అభిమానులు కార్యకర్తలు తరలిరావటంతో పల్నాడు రోడ్డు జనసంద్రమైంది. కార్యకర్తలు నినాదాలు చేస్తూ వస్తున్న తరుణంలో ర్యాలీ బాలాజీ హాస్పటల్ వద్దకు రాగానే పోలీసులు మైక్‌కు పర్మిషన్ లేదంటూ అడ్డుకున్నారు. దీంతో కార్యకర్తలు ఒక్కసారిగా పోలీసు చర్యలపై మండిపడ్డారు. ఇంతలో బొల్లా కలుగజేసుకుని మైకు లేనంతమాత్రాన ర్యాలీ ఆగదని మైకు లేకుండానే ర్యాలీ కొనసాగించారు.

క్రోసూరులో..

పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం ర్యాలీ జరిగింది. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. వేలాదిమంది వెంట రాగా గ్రామంలోని నాలుగు రోడ్ల కూడలిలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించి అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబుపాలన రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకాలు చేయటం మినహా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లిలో పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి గడియార స్తంభం వరకు, అక్కడ నుంచి తిరిగి తహసీల్దార్ కార్యాలయం వరకు వైఎస్సార్ సీపీ శ్రేణులు కదం తొక్కారు. తహసీల్దార్ కేఎస్ చక్రవర్తికి వినతి పత్రం అందించారు. అనంతరం సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి రావడమే పరమావధిగా అడ్డగోలుగా హామీలు ఇవ్వడం, ఆపై ప్రజల ను వంచించడంలో చంద్రబాబు నాయుడుని మించినవారు దేశంలోనే ఉండరన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మాచర్లలో పోలీసుల ఆంక్షలు

మాచర్ల పట్టణంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలను పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ కార్యాలయం నుంచి నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పూనూరి గౌతమ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమాదేవి, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి సతీమణి స్వాతిల ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలతో పార్టీ కార్యాలయం నుంచి బయల్దేరగా అనుమతి లేదంటూ పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమాన్ని శాంతియుతంగా జరుపుతామని అడగ్గా, గురజాల డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో పోలీసులు అనుమతి లేని విషయాన్ని చెప్పి వెళ్లిపోవాలంటూ బెదిరించారు. పార్టీ కార్యాలయంలో మాత్రమే కార్యక్రమం నిర్వహించుకోవాలని చెప్పారు. దీనిపై పిన్నెల్లి రమాదేవి మాట్లాడుతూ మేం శాంతియుతంగా ర్యాలీ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు వెళతామని కోరారు. దీనికీ పోలీసులు అనుమతించలేదు. దీంతో పార్టీ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసనలు తెలిపారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు వెన్నుపోటు దినం ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. పార్టీ జెండాలతో పిడుగురాళ్ల పట్టణం రెపరెపలాడింది. గంగమ్మ గుడి నుంచి కాసు మహేష్ రెడ్డి నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ మీదుగా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే దారిలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అసమర్థత వల్ల మొదటి మూడు నెలల్లోనే పిడుగురాళ్లలో ఐదుగురు, దాచేపల్లిలో ఇద్దరు డయేరియా బారిన పడి చనిపోయారన్నారు. అనంతరం భారీ ర్యాలీతో పట్టణంలోని మున్సిపల్ కార్యాయానికి వెళ్లి మున్సిపల్ డీఈ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని కాసు మహేష్ రెడ్డి అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మురళీధర్ రెడ్డి, రాష్ట్ర సెక్రటరీ, మున్సిపల్ వింగ్ ప్రెసిడెంట్ రేపాల శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్, సీనియర్ నాయకుడు కె.వి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

అన్నివర్గాల వారికి బాబు వెన్నుపోటు

చిలకలూరిపేట ఎన్‌ఆర్‌టీ రోడ్డులోని మాజీ మంత్రి విడదల రజిని నివాసం నుంచి మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధం కాగా అర్బన్ సీఐ పి.రమేష్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు మరో మహిళా సీఐ, నియోజకవర్గ పరిధిలోని ఎస్ఐలతో వచ్చి బైక్ ర్యాలీకి పర్మిషన్ లేదంటూ అడ్డుకున్నారు. దీంతో మండే ఎండలో సైతం పాదయాత్రగా ఎన్ఆర్‌టీ రోడ్డు, ఎన్ఆర్‌టీ సెంటర్, చౌత్రా సెంటర్, మెయిన్‌బజార్, గడియార స్తంభం సెంటర్, కేబీ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర కొనసాగింది. నినాదాలతో దారి పొడుగునా యువత హోరెత్తించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద విడదల రజిని మాట్లాడుతూ సూపర్ సిక్స్‌తో సహా 143 హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసగించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. హామీలు అమలు చేయకుండా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ఎస్‌కేఎండీ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు.

స్వచ్ఛందంగా తరలిన ప్రజలు

నరసరావుపేటలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతమైంది. డాక్టర్ గోపిరెడ్డి ఆధ్వర్యంలో గుంటూరురోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పార్టీ శ్రేణులు, ప్రజలు వేలాదిగా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేశారు. రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మధులతకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు, అవినీతి, అరాచకంపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసానికి విస్తుపోయిన ప్రజానీకం వెన్నుపోటు దినోత్సవ నిరసన ర్యాలీలో వేలాదిగా స్వచ్ఛందంగా పాల్గొన్నారని అన్నారు. ఏడాదిగా ఈ ప్రభుత్వం రూ.1.50లక్ష కోట్లు అప్పు చేసిందని, ఒక్క పథకం కూడా ప్రజలకు అమలు చేయకుండా, ఈ డబ్బంతా ఏం చేశారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రూ.4లక్షల కోట్లు అప్పు చేసినప్పటికీ రూ.2.70లక్షల కోట్లు వివిధ పథకాల ద్వారా ప్రజలకు ఇచ్చారన్నారు. ఇప్పుడు ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ప్రజల కు ఇచ్చిన పాపాన పోలేదని, ప్రజలు ఎక్క డ ప్రశ్నిస్తారోనని వారి దృష్టి మళ్లించేందుకు తమ పార్టీకి చెందిన నాయకులను రోజుకు ఒకరి చొప్పున జైళ్లల్లో పెట్టి చిత్ర హింసలు పెట్టి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మాజీ సీఎం జగన్ ఒక్క పిలుపు మేరకు నరసరావుపేటలో వేలాదిమంది జనం వీధుల్లోకి వచ్చారన్నారు. ప్రశ్నించేందుకే ఉన్నాననే డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్ హామీలు అమలుచేయకుండా అరాచకాలు చేస్తుంటే ఏమాత్రం స్పందించడం లేదన్నారు.



సత్తెనపల్లిలో వెన్నుపోటుదినం ర్యాలీలో సమన్వయకర్త సుధీర్ భార్గవ్‌రెడ్డి



వినుకొండలో జరిగిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



క్రోసూరులో జరిగిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

వైకుంఠపురం వెంకన్న కొండకు అపచారం

కూటమి నేతల అండతో తవ్వి తరలింపు

అమరావతి: పవిత్ర పుణ్యక్షేత్రమైన వైకుంఠపురంలో స్వయంభూగా వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి వారి కొండకు అపచారం జరుగుతోంది. కూటమి నేతల అండదండలతో కొందరు అక్రమంగా గ్రావెల్ కోసం కొండను తవ్వేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. వివరాల్లోకెళితే.. రాజధాని అమరావతికి సమీపాన ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన వైకుంఠపురం కొండపై వేంకటేశ్వరుడు కొలువై ఉన్నాడు. ఈకొండ పక్కనుంచే పవిత్ర కృష్ణానది ఉత్తర దిక్కుగా ప్రవహించి ఉత్తరవాహినిగా పేరుగాంచింది. ఈకొండ చుట్టూ అష్టదిగ్బంధనంలాగా ఎనిమిది ఆంజనేయస్వామి వారి విగ్రహాలు ప్రతిష్ఠించి ఉన్నాయని గ్రామస్తులు నమ్మకం. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన కొండను కూటమి నేతల అండదండలతో పలువురు ఉత్తరవాహిని సమీపంలో తవ్వి గ్రావెల్ తరలిస్తున్నారు. రోజుకు వందలాది ట్రక్కులకు పైగా భారీ పొక్లెయిన్లతో మట్టి తవ్వి తరలిస్తున్నారు. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈకొండను తాము ఎంతో పవిత్రంగా పూజిస్తామని అటువంటి కొండను తవ్వడం అపచారమంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు అక్రమ గ్రావెల్ తవ్వకాలపై దృష్టిసారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.



అక్రమార్కులు తవ్వేసిన వైకుంఠపురం కొండ

మెగా డీఎస్సీకి ఏర్పాట్లు పూర్తి

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా పరిధిలో ఈనెల 6వతేదీ నుంచి ప్రారంభం కానున్న మెగా డీఎస్సీ- 2025 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ బుధవారం తెలిపారు. నరసరావుపేట పట్టణ పరిధిలోని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (యలమంద), ఏ.ఎం.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (పెట్లూరివారిపాలెం), తిరుమల ఇంజినీరింగ్ కళాశాల (జొన్నలగడ్డ), ఎం.ఏ.ఎం ఇంజినీరింగ్ కళాశాల (కేసానుపల్లి) పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాలలో ఈనెల 6వతేదీ నుంచి 30వతేదీ వరకు నిర్వహించనున్న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌కు 11,107మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. అభ్యర్థులు పరీక్షా సమయానికి ఒక గంట ముందుగా వారికి కేటాయించిన పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. నిర్ణీత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైన అభ్యర్థులకు లోనికి అనుమతించరని స్పష్టం చేశారు. హెల్ప్‌డెస్క్ 9963192487 నంబరును ఏర్పాటు చేశామన్నారు.



ఎస్ఈసీ కళాశాల పరీక్షా కేంద్రం

కరోనా కలకలం...
బదిలీల కలవరం

- వైద్య ఉద్యోగుల్లో ఆందోళన
- ఐదేళ్లు దాటితే స్థాన చలనం
- యూనియన్‌లకు ప్రాధాన్యత అంతంతే

గుంటూరు మెడికల్: జిల్లాలో ఒక పక్క కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. మరోపక్క గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది కరోనా సోకి ఇబ్బంది పడుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులను కూడా ఈ పరిణామాలు కలవరపెడుతున్నాయి. గతంలో అనేక మంది వైద్య ఉద్యోగులు కరోనా బారిన పడి చికిత్స పొందారు. కొంత మంది ప్రాణాలు కోల్పోయారు. మరోసారి కరోనా కేసులు రావడం ఉద్యోగుల్లో ఆందోళనకు దారి తీసింది. మరోపక్క వైద్య ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వం చేపట్టింది. ఈ నెల 19వ తేదీలోపు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేయనున్నారు.

ఐదేళ్ల సర్వీసు పూర్తయితే స్థానచలనం

ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వైద్యులు, వైద్య సిబ్బందికి తప్పనిసరిగా స్థానచలనం కలిగించనున్నారు. గతంలో దీర్ఘకాలం ఉన్న సిబ్బందిలో 20 శాతం మందిని మాత్రమే బదిలీ చేసేవారు. దీంతో అందరూ ఇబ్బంది పడేవారు కాదు. ఇప్పుడు ఐదేళ్ల సర్వీసు, కొన్ని కేడర్‌లలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరిని బదిలీ చేయాలని నిబంధన పెట్టారు. దీంతో బదిలీల కలవరం ప్రారంభమైంది.

ప్రాక్టీస్ వదిలి వెళ్లలేక..

దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేయడం వల్ల గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల, జిల్లాలోని పలు ఆసుపత్రుల వైద్యులు ఎక్కువ శాతం మంది సొంత క్లినిక్‌లు పెట్టుకున్నారు. గుంటూరులోనే ప్రాక్టీస్ చేస్తున్నారు. జిల్లాలో మరికొన్ని ప్రాంతాల్లో వైద్యులు ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం తప్పనిసరి బదిలీ నిబంధనతో ప్రాక్టీస్ వదిలి వెళ్లేందుకు పలువురు సంశయిస్తున్నారు. వైద్య సిబ్బంది సైతం గుంటూరు చుట్టుపక్కల పిల్లలను చదివించుకుంటూ, గృహాలు నిర్మించుకుని ఇక్కడే స్థిరపడ్డారు. విద్య, వైద్య రంగంలో ఎప్పటి నుంచో గుంటూరు జిల్లాకు పేరుండటంతో అనేక మంది స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. బదిలీల పేరుతో ప్రభుత్వం వేరేచోటకు పంపించేందుకు సిద్ధమడంతో వారు ఆందోళన పడుతున్నారు.



జూనియర్ అసిస్టెంట్ల ఆందోళన

జీజీహెచ్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు పదోన్నతులు వదులుకొని సుమారు 20 -30 సంవత్సరాలుగా ఇక్కడే పనిచేస్తున్నారు. ప్రమోషన్ తీసుకుంటే ఇతర జిల్లాలకు బదిలీ చేస్తారన్న భయంతో ఇలా చేశారు. అందులోనూ గుంటూరు జీజీహెచ్‌లోనే జీవితాంతం పనిచేసేందుకు అన్ని బెనిఫిట్స్ వదులుకుని పలువురు జూనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా వారిని సైతం బదిలీ చేస్తారంటూ ఊహాగానాలు వచ్చాయి. దీంతో జీజీహెచ్ మినిస్టీరియల్ ఉద్యోగులంతా సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. రాష్ట్రపతి అనుమతి లేకుండా గుంటూరు జీజీహెచ్ యూనిట్ సిబ్బందిని బదిలీ చేసే అధికారం ఎవరికీ లేదనే విషయాలను బయటపెట్టారు. సదరు విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి సైతం పంపించారు. దీంతో ఈ ఏడాదికి జూనియర్ అసిస్టెంట్‌లకు బదిలీలు లేనట్లేనని వార్తలు వినిపిస్తున్నాయి.

యూనియన్‌లకు ఆంక్షలు

గతంలో యూనియన్ పేరుతో ఉద్యోగులు దీర్ఘకాలికంగా ఒకే ప్రాంతంలో ఉండేవారు. నేడు ఒకేచోట లేకుండా పలు మార్గదర్శకాలను సంఘ నాయకులకు ప్రభుత్వం విడుదల చేసింది. యూనియన్‌లో చేరిన సభ్యత్వాల రశీదులు, ఎన్నికల్లో పాల్గొన్నట్లు జాబితా, యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు వివరాలు సమర్పించాలని పేర్కొంది. దీంతో నేతలకు సైతం స్థానచలనం తప్పడం లేదు. నగరంలో ఒక చోట నుంచి మరోచోటికి యూనియన్ నేతలు బదిలీ కోరుకునేలా కొంత మినహాయింపు ఇచ్చారు.

20 రోజుల ప్రక్రియ

వైద్య ఆరోగ్య శాఖలో బదిలీ ప్రక్రియ 20 రోజులపాటు జరుగనుంది. మే 31 నుంచి జూన్ 19వ తేదీ వరకు నిర్వహిస్తారు. జూన్ 17 – 19 వరకు కౌన్సెలింగ్ ఉంటుంది. తర్వాత బదిలీ ఉత్తర్వులు అందజేస్తారు. ఒకేచోట రెండేళ్లకుపైగా పనిచేస్తున్న వారు రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులకు, ఉద్యోగులైన భార్యభర్తలకు నిబంధనల ప్రకారం బదిలీలు నిర్వహిస్తారు. గురు, శుక్రవారాల్లో అభ్యర్థులు బదిలీ ఆప్షన్లు ఎంచుకునేందుకు గడువు ఇచ్చారు. గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం, గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయాల్లో ఉద్యోగులు, అధికారులు కొద్దిరోజులుగా బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో నగలు, నగదు చోరీ



బెల్లంకొండ: తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగలు నగలు, నగదు చోరీ చేసిన ఘటన మండలంలోని నాగిరెడ్డి పాలెం గ్రామంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై డి.ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఎర్రబద్దూరి చిన రమణారెడ్డి కుటుంబ సభ్యులతోపాటు గ్రామంలోని మరి కొంతమందితో కలిసి సోమవారం శ్రీశైలం దైవ దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో రమణారెడ్డి ఇంట్లోకి దొంగలు కిటికీ గుండా చొరబడ్డారు. బీరువా పగలుకొట్టి 23.5 సవర్ల బంగారం, 15 వేల నగదు చోరీ చేశారు. మంగళవారం ఉదయం ఇరుగు పొరుగువారు ఇంటి పరిసర ప్రాంతాల్లో వస్తువులు చెల్లాచెదురుగా ఉండడాన్ని గమనించారు. వెంటనే విషయాన్ని రమణారెడ్డి బంధువులతో చెప్పగా వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు వచ్చి పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ద్వారా ఆధారాలు సేకరిస్తున్నట్లు పెదకూరపాడు సీఐ సురేష్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, దొంగలను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



అచ్చంపేట: ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయిన బాలుడిని సామాజికవేత్త షేక్ కమల్‌సైదా బుధవారం తల్లిదండ్రులకు అప్పగించారు. అచ్చంపేట ఎస్సీ కాలనీకి చెందిన సందెపోగు వివేక్ గత 29న గుంటూరు వెళ్లి రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కి మహారాష్ట్రలోని జనగావ్ జిల్లా స్టేషన్ పోలీసులకు చిక్కినట్లుగా కమల్‌సైదా సమాచారం తెలుసుకున్నారు. మహారాష్ట్రలోని పోలీస్ వారితో మాట్లాడి వివేక్ పల్నాడు జిల్లా అచ్చంపేట గ్రామానికి చెందినవాడిగా సమాచారం అందించారు. తిరిగి అచ్చంపేటకు రప్పించారు. గత వారం రోజులుగా కుమారుడి కోసం వెతుకుతున్న తల్లిదండ్రులకు అతడిని అప్పగించడంతో ఆనందపడ్డారు. కార్యక్రమంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బీరువాల సైదా తదితరులున్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం

పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

విజయపురి సౌత్: యోగాతో ఒత్తిడి దూరమై మానసిక ఉల్లాసం కలుగుతుందని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం పల్నాడు జిల్లా మాచర్ల మండలంలో ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన అనుపు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ప్రసిద్ధ పర్యాటక కేంద్రంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుమారు 2000 మంది పాల్గొన్నారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి మురళి మాట్లాడుతూ.. ఈ నెల 21వ తేదీన కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాచర్ల పట్టణానికి చెందిన మెట్టు గోవిందరెడ్డి దాదాపు 200 యోగా మ్యాట్స్‌ను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. బెలూన్లను గాలిలోకి వదిలారు. నాగార్జునకొండ క్యూరేటర్ కమల్ హాసన్, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి, పర్యాటకశాఖ డివిజనల్ మేనేజర్ చైతన్య, ఆర్డీవో మురళీకృష్ణ, జిల్లా మెడికల్ ఆఫీసర్ డా.రవి, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణ మోహన్, ఈఈ రమేష్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజా నాయక్, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీ రాణి, ట్రాన్స్‌పోర్ట్ అధికారి సంజీవ్ కుమార్, డీఎఫ్ఓ ఫైర్ శ్రీధర్‌రావు, డీఎల్‌డీవో గబ్రు నాయక్, హౌసింగ్ ఈఈ రవీంద్ర, డీపీఓ నాగేశ్వర నాయక్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాయుడమ్మ, జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవ రావు, డీసీఓ వెంకటరమణ, ఏపీఎంఐపీ ఆంజనేయులు, ఏపీటీడీసీ డిప్యూటీ మేనేజర్ శివారెడ్డి, గ్రౌండ్ వాటర్ అధికారి శ్రీనివాసరావు, మాచర్ల మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, మాచర్ల తహసీల్దార్ కిరణ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.


అనుపులో కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు, ఉద్యోగులు

వైఎస్సార్‌సీపీ నేతలను అడ్డుకున్న పోలీసులు


నిరసన వ్యక్తం చేస్తున్న రమాదేవి, స్వాతి, గౌతమ్‌రెడ్డి, కార్యకర్తలు, నాయకులు

మాచర్ల: రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల పట్టణంలో చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాలను పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ కార్యాలయం నుంచి నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూనూరి గౌతమ్‌రెడ్డి, పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమాదేవి, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి సతీమణి స్వాతి తదితరులు వందల మంది కార్యకర్తలతో పార్టీ కార్యాలయం నుంచి బయల్దేరారు. అనుమతి లేదంటూ పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతలకు సమస్యలు తలెత్తుతాయని పోలీసులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. గురజాల డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో పోలీసులు అనుమతి లేని విషయాన్ని చెప్పి వెళ్లిపోవాలంటూ బెదిరించారు. పార్టీ కార్యాలయంలో మాత్రమే కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. దీనిపై పిన్నెల్లి రమాదేవి పోలీసులతో మాట్లాడుతూ శాంతియుతంగా ర్యాలీ చేసుకునేందకు కూడా అనుమతి లేదా? అని నిలదీశారు. ప్రభుత్వం అమలు చేయని హామీలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తహసీల్దారు కార్యాలయం వరకు వెళతామని కోరారు. అయినప్పటికీ పోలీసులు అనుమతించలేదు. చేసేది లేక పార్టీ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు, అభిమానులు అక్కడకు చేరుకున్నారు. ప్లకార్డులు ప్రదర్శించి చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, కె.కోటయ్య, మాజీ ఎంపీపీ సంపూర్ణమ్మ, పట్టణ అధ్యక్షుడు కోలా శ్రీను, దుర్గి మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం పెద్దబ్బాయి, కౌన్సిలర్లు మాచర్ల సుందరరావు, మురళి, మందా సంతోష్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మరియమ్మ, న్యాయవాది మాధవి, సర్పంచ్‌లు వి.చిన్న, జి.బ్రహ్మారెడ్డి, పార్టీ నాయకులు ఆకుల శ్రీనివాసనాయుడు, డాక్టర్ కరీముల్లా, కె.మస్తాన్, నాగూర్, కొమ్ము చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, కె.ఏబు, మాచర్ల ఎంపీపీ పోతిరెడ్డి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


గౌతమ్ రెడ్డిని, నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

పీఏసీఎస్‌లు లక్ష్యాలు చేరుకోవాలి

డీసీడీసీ సమావేశంలో కలెక్టర్ ఆదేశం

నరసరావుపేట: జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)ల సీఈఓలు ఈ నెలారుకల్లా నిరర్థక ఆస్తులకు సంబంధించి వంద శాతం లక్ష్యాలు చేరాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం కార్యాలయంలో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ ఆరో సమావేశం నిర్వహించారు. పలు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఈఓలు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు జిల్లాలో ఎరువులు వ్యాపారం చేయని 21 ప్రాథమిక పీఏసీఎస్‌లు వ్యవసాయ శాఖ నుంచి ఎరువుల లైసెన్సులు పొందాల్సి ఉందని, అందుకు సర్టిఫికెట్లను దర్శిలోని కృషి విజ్ఞాన్ కేంద్రం నుంచి తీసుకోవాలని ఆదేశించారు. ఈ పీఏసీఎస్‌ల సీఈఓలు జూన్ 10వ తేదీలోపు తప్పనిసరిగా జీఎస్‌టీ నంబర్ తీసుకోవాలని అన్నారు. జిల్లాలోని పీఏసీఎస్‌లు తాము చేపట్టబోయే వ్యాపార అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసి రాబోయే సమావేశానికల్లా సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పీఏసీఎస్‌లు నిర్వహిస్తున్న కామన్ సర్వీస్ సెంటర్ల లావాదేవీలను పెంచాలని సూచించారు. గోదాములను వంద శాతం వినియోగించేందుకు కార్యాచరణ ప్రణాళికను తయారు చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. నికర విలువ ఉన్న అన్ని పీఏసీఎస్‌లు ఈ నెల 30వ తేదీ లోపు డబ్ల్యూడీఆర్ఏ గుర్తింపు పొందాలని ఆదేశించారు. వివిధ కారణాలతో మూసివేయబడిన ధూళిపాళ్ళలోని ఆంధ్రాబ్యాంకు ఫార్మర్స్ సర్వీస్ కోపరేటివ్ సొసైటీ పెట్రోల్‌బంక్‌ను తిరిగి ప్రారంభించేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులతో చర్చించాలని సూచించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకానికి సంబంధించిన పురోగతి సరిగా లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జీడీసీసీబీ సీఈఓ తక్షణమే రుణ విధానాలను నిర్ణయించి, అమలు చేయాలని అన్నారు. జిల్లా సహకార అధికారి ఎం.వెంకట రమణ, జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్, మత్స్యశాఖ జిల్లా అధికారి సంజీవ రావు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి కాంతారావు, జీడీసీసీ బ్యాంకు ఏజీఎం సుబ్బారావు, జిల్లా సహకార ఆడిట్ అధికారి శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ఫిరంగిపురం: ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతిని నిర్మించనున్నట్లు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో వనమహోత్సవం కార్యక్రమానికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రానున్నారు. దానికి సంబంధించి ఏర్పాట్లను బుధవారం రాత్రి నారాయణ పరిశీలించారు. ముఖ్యమంత్రి మొక్కలు నాటే ప్రాంతాన్ని పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వనమహోత్సవం సందర్భంగా ఐదు కోట్ల మొక్కలు నాటుతామన్నారు. రాజధాని ప్రాంతాన్ని అత్యున్నత నిర్మాణాలతోపాటు గ్రీన్ అండ్ బ్లూ నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు. పచ్చదనం కోసం ఒకే రకం మొక్కలు కాకుండా సింగపూర్, జపాన్‌తో సంప్రదించి అక్కడి మాదిరిగా ప్లాంటేషన్ ఉండేలా చూడమని చంద్రబాబు సూచించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాజధాని ప్రాంతాన్ని ఆహ్లాదకరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ ఎండీ లక్ష్మీపార్థసారథి, ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ సుజాత, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ఎస్పీ సతీష్‌కుమార్

అత్యుత్తమ నగరంగా అమరావతి నిర్మాణం

ఫిరంగిపురం(తాడికొండ): తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో గురువారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే వన మహోత్సవానికి ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పర్యటన ఏర్పాట్లను ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, రాష్ట్ర ఏపీఎంఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, ఆర్డీవో శ్రీనివాసరావులు పరిశీలించారు. సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎ.భార్గవ్ తేజ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అధికారులు చేపట్టాల్సిన వివిధ పనులపై తగిన సూచనలు అందజేశారు. శానిటేషన్, పార్కింగ్, బ్యారికేడ్ పనులు సజావుగా చేపట్టాలని చెప్పారు. నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. వారి వెంట ఫారెస్ట్ కన్జర్వేటర్ రాజు, అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) రవికుమార్, డీఎస్పీ మురళీకృష్ణ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఎండీ నజీమా బేగం, ఏపీఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బసవేశ్వరరావు, తుళ్లూరు సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్లు సుజాత, వెంకటేశ్వర్లు, పలు శాఖల అధికారులు ఉన్నారు.

మూడు వాహనాలు ఢీ.. ఒకరు మృతి

రొంపిచర్ల: మూడు వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన రొంపిచర్ల సమీపంలోని శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సు కందుకూరుకు వెళ్తోంది. రొంపిచర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే బస్సు ఆగటంతో 8 మంది ప్రయాణికులు దిగారు. అదే సమయంలో వెనుకగా వస్తున్న కంటైనర్ లారీ అదుపు తప్పి ఆగి ఉన్న బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో బస్సు రోడ్డు మార్జిన్‌కు దూసుకు రాగా, ఢీకొట్టిన లారీ రోడ్డుపైనే నిలబడింది. ఇంతలో అదే రూట్‌లో వస్తున్న ప్రయివేటు ట్రావెల్ బస్సు అదుపుతప్పి కంటైనర్ లారీని ఢీకొంది. కంటైనర్ లారీ ముందు భాగంలో నిల్చొని ఉన్న ప్రయాణికుడు బెల్లంకొండ మాధవరావు(40)పై నుంచి లారీ వెళ్లింది. మాధవరావు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనిది ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గం పరిధిలోని గుడ్లూరి మండలం, మిట్టపాలెం గ్రామం అని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో బస్సులు, లారీకి నష్టం వాటిల్లింది. వెంటనే ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్ సహాయంతో పోలీసులు తొలగించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ సీహెచ్ మణికృష్ణలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


క్రేన్ సహాయంతో బస్సును తొలగిస్తున్న దృశ్యం

ప్రతి ఇల్లు యోగా కేంద్రం కావాలి

గుంటూరు వెస్ట్: ప్రతి ఇల్లు యోగా కేంద్రంగా మారితే ఆ ఇంట ఆరోగ్య, మానసిక సమస్యలు చాలా వరకు తగ్గిపోతాయని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. బుధవారం యోగాంధ్రాలో భాగంగా స్థానిక బృందావన్‌గార్డెన్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనతోపాటు నగర మేయర్ కోవెలమూడి రవీంద్రనాథ్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, డెప్యూటీ మేయర్ షేక్ షజీల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొన్ని రోజులుగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శారీరక, మానసిక ప్రయోజనాలు కలిగించే యోగాపై ప్రజలు విస్తృతంగా అవగాహన పెంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో యోగ ఒక భాగం కావాలన్నారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు యోగాసనాలు వేశారు.


యోగాసనాలు వేస్తున్న ఎ.భార్గవ్‌తేజ, ఎమ్మెల్యే మాధవి, అధికారులు

వివాహ వేడుకల్లో బంగారు నగ చోరీ

లక్ష్మీపురం: వివాహ వేడుకల్లో బ్యాగ్‌లోని 8 సవర్ల బంగారు ఆభరణం చోరీకి గురైన ఘటనపై బుధవారం అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన మూలుపూరి హనుమంతరావు మే 5వ తేదీన కుటుంబ సభ్యులతో అమరావతి రోడ్డులోని విజయం కల్యాణ మండపంలో మేనల్లుడి వివాహ వేడుకలకు హాజరయ్యారు. వివాహం జరిగే సమయంలో హనుమంతరావు భార్య 8 సవర్ల బంగారు నెక్లెస్‌ను వరుడు గదిలోని బ్యాగ్‌లో పెట్టారు. వివాహం అయిన తరువాత గదిలో వెళ్లి చూసే సరికి బ్యాగ్ కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల పరిశీలించగా కనిపించలేదు. దీంతో బుధవారం హనుమంతరావు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్‌కు జాతీయస్థాయిలో రజత పతకం

అభినందించిన ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: పట్టుదలతో పోరాడినప్పుడే విజయాలు మన సొంతమవుతాయని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. కర్లపాలెం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే వీరంకి నరేంద్ర 13వ జాతీయ స్థాయి పెన్ కాక్ సిలాట్ చాంపియన్‌షిప్–2025లో రజత పతకం సాధించారు. కానిస్టేబుల్‌ను బుధవారం ఎస్పీ తుషార్‌డూడీ అభినందించారు. ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ 2025 మే 9 నుంచి 12వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నో నగరంలో కేడీ సింగ్‌బాబు స్టేడియంలో జరిగిన 13వ జాతీయ స్థాయి పెన్‌కాక్ సిలాట్ చాంపియన్ షిప్–2025 లో వీరంకి నరేంద్ర సత్తా చాటి రజత పతకం గెలుపొందారన్నారు. క్రీడలలో సత్తా చాటి జిల్లా పోలీస్ ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింప చేస్తూ పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. గతంలో కూడా జాతీయ స్థాయిలో రెండు మెడల్స్ సాధించాడని, 2024లో జరిగిన సెకండ్ ఆల్ ఇండియా పెన్‌కాక్ సిలాట్ చాంపియన్ షిప్‌లో కాంస్య పతకం, 2018లో 3వ ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించాడన్నారు. రాబోయే రోజుల్లో మంచి తర్ఫీదు పొంది అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఎస్పీ ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యం, మానసిక దృఢత్వాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయన్నారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచినవారిని ప్రోత్సహిస్తామన్నారు.


కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ నర్సింగ్ (Girls), MLT, వెటర్నరీ, అగ్రికల్చర్, ఫిజియోథెరపీ కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. బాల బాలికలకు హాస్టల్ వసతి కలదు. M.S.M. College, Guntur. 7386706839, 7780494333

REAL ESTATE
LEASE
■ సత్తెనపల్లి నడిబొడ్డులో SBI బజారు బ్యాంక్ ఎదురు HDFC బ్యాంక్ ప్రక్కన 12,000చ.॥ 3 ఫ్లోరు బిల్డింగు లీజుకు కలదు. సంప్ర॥ 9985091890, 9985361999

SERVICES
BUSINESS OFFER
■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి. సలహాలకి కాల్ చేయండి :7406393937

GOLD FINANCE
■ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ మరియు లేడీ గోల్డ అప్రైజర్ కావలెను. సంప్ర॥ 7780262404, 9966877539
■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

WANTED
■ గుంటూరు శ్యామలనగర్ 1వ లైన్ మాంటిస్సోరి స్కూల్ నందు పనిచేయుటకు వాచ్‌మెన్ ఫ్యామిలి (వసతి కలదు) మరియు ఆయమ్మలు కావలెను. 8142235121
■ గుంటూరులోని ప్రముఖ ఆఫీసు వారికి డిగ్రీ అర్హత కలిగిన లేడీ టెలికాలర్స్ వెంటనే కావలెను. మంచి జీతం+10వేలు ఇన్సెంటివ్ ఇవ్వబడును. మార్కెటింగ్ అభ్యర్థులు M/F కావలెను. 8019862508
■ గుంటూరు కాకాని రోడ్డు, అరండల్‌పేటలో వర్క్ చేయుటకు లేడీ టెలికాలర్స్, 80 మంది కావలెను. జీతం: 9000-15000. సంప్ర॥యు.వీరాంజనేయులు ప్రకాశం జిల్లా. 9160358658
■ గుంటూరు సిటీలో ఇండ్లకు స్మార్ట్ మీటర్లు బిగించుటకు ఐటీఐ చదివి అనుభవం గల ఎలక్ట్రీషియన్లు కావలెను. లోకల్ వారు సంప్ర॥ 9908837708

■ విశ్రాంత ఉద్యోగులకు, శుభవార్త గుంటూరు నగరంలో ప్రముఖ బ్యాంకు అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు 10th పాస్, 25సం పై॥ వయస్సు వారు కావలెను. 9490127118
■ Wanted Lady Tele caller / Team lead for SK Consultancy Services, koritipadu, Guntur. Q: Graduation, s: 10k - 20k + insensitive. Contact No: 98664 57591
■ ఉచితంగా Computer Spoken English, Soft Skills 3 నెలల వ్యవధిలో శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించబడును. (ఉచిత భోజనం మరియు హాస్టల్ వసతి) Q: 10th & above, గుంటూరు. 9133444985/ 88
■ ఇంగ్లీష్ ట్రైనర్స్, హైస్కూల్ టీచర్స్, లేడీ ట్యూటర్స్, కంప్యూటర్ DCA, DTP, టాలీ, C, జావా, పైథాన్ ఫ్యాకల్టీ కావలెను. ఫ్రెషర్స్ కు కూడా ట్రైనింగ్ ఇచ్చి తీసుకోబడును. గుంటూరు, మంగళగిరి. 86390 24439
■ గుంటూరు ఆఫీస్ నందు పనిచేయుటకు మేల్ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను మంచిజీతం, PF + ESI. Qul :10th 8గండ్యూటీ వ.22-45✆ 98482 66840
■ కేర్ టేకర్స్ (M/F), నర్సులు, ఆయాలు, విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు, అత్యధిక జీతం+వ+భో. ఏజెంట్ కమీషన్ 6 వేలు. ✆ 91608 35559, 78158 35561

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (3 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశదంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రీతిలో క్లెయిమ్ చేసే వాటితో ఈ దినపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.